# పీడిత జన గళం మహాశ్వేతాదేవికి జోహార్లు



**“నావేషభాషలు** విదేశీ సంస్కృతికి చెందినవై నప్పటికీ నా హృదయం మాత్రం భారతీయమైనది. ....నాదేశం చిరిగిన విస్తరి, పీలికలుగా చిరిగిన జీర్ణవస్త్రం, అహంకారి, అందమైనది; వేడి, తేమతో కూడిన సమశీతోష్ణ వాతావరణం కలది, శీతలమైనది, యిసక నేలలలున్నది– ప్రకాశిస్తున్న భారతదేశం – అదే నాదేశం” అంటూ ఫ్రాంక్‌ఫర్ట్ పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవ సభలో సగర్వంగా ప్రకటించుకొన్న మహత్తర దేశభక్తురాలు మహాశ్వేతాదేవి.

ఆవిడకు, గురజాడ చెప్పినట్లు దేశమంటే మట్టికాదు; దేశమంటే మనుష్యులు. జాతీయత అంటే ప్రాణంలేని భౌగోళిక ప్రదేశం కాదు. జాతీయత అంటే శ్రామిక జనావళి. సామాన్య ప్రజలే నిజమైన చరిత్ర నిర్మాతలు అన్నది ఆవిడ ధృడాభిప్రాయం.

జులై 28వ తేదీ తెల్లవారుఝామున కోల్‌కతాలో మరణించిన మహాశ్వేతాదేవి మృతిపట్ల ‘జనశక్తి’ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తోంది.

దోపిడీకి గురవుతూన్నప్పటికీ ఓటమిని అంగీకరించక నిరంతరాయంగా పోరాడుతున్న ప్రజానీకాన్ని మహాశ్వేతాదేవి తన రచనా వ్యాసంగానికి స్ఫూర్తిగా స్వీకరించింది.

బ్రిటిష్ వలస పాలనా కాలం నుండీ, నేటివరకూ కూడా అధమాధములుగా పరిగణించ బడుతూ, నికృష్ట దోపిడీకి, నిరంతర నిర్లక్ష్యానికి గురికాబడుతున్న గిరిజనుల (ఆదివాసుల) పక్షం వహించి, వారి సమస్యల పరిష్కారం కోసం ఆవిడ గళం విప్పింది.

బ్రిటిష్ వలసపాలకుల కాలంలో నేరస్థులుగానూ, దోపిడీదొంగలుగానూ ముద్రవేయబడి, ఆనక భారతపాలకుల పరిపాలనలో ఆ నేరస్థపు ముద్రను రద్దు చేసినా , గతంలో మాదిరిగానే నేరస్థులుగా రాజ్యం చేత వేధింపబడుతున్న గిరిజన సంచార తెగలైన లోధా, బేరియుసాబర్ తెగల హక్కుల కోసం ఆవిడ పోరాటం సలిపింది.

ఆదివాసీ జనాల్లో పేరుకుపోయిన ఆకలి, దారిద్ర్యం, అమాయకత్వం, అజ్ఞానం, భయాలను పోగొట్టి వారిని, ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దటానికి ఆవిడ పలురకాలుగా కృషి చేశారు.

ఆదివాసీల హక్కుల కోసం ధర్మయుద్ధం సాగించిన మహనీయురాలు మహాశ్వేతాదేవి. ఆవిడ భారత సామాజిక వ్యవస్థ చేత అనాదరణకూ, అలక్ష్యానికి గురయిన పీడిత సెక్షన్ల జనులైన –ఎటువంటి ఆస్తిపాస్తులూ హక్కులూ లేకుండా నిరాకరించబడిన ప్రజల, మహిళల, ఆదివాసీల దళితుల, భూమిలేని రైతుల, వలస కూలీల, పతితుల హక్కులకోసం తీవ్రంగా పోరాడిన మహోన్నత సామాజిక కార్యకర్త.

ఆవిడ తన సృజనాశక్తినీ, భావవ్యక్తీకరణా నైపుణ్యాన్నీ ఒక ఆయుధంగా మలచి సమాజంలో అణచివేత, పీడనలకు గురయిన అట్టడుడు వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాటం జరిపేందుకు ఆ ఆయుధాన్ని ప్రతిభావంతంగా ప్రయోగించిన పోరాట యోధురాలు.

ఆవిడ నాడు బ్రిటిష్ వలస పాలకులతో పోరాడిన ఆదివాసీ బిర్సాముండా యొక్క తిరుగుబాటుపై “అరణ్యేర్ అధికార్” (ఎవరిదీ అడవి) అనే నవలను రాసి 1979లో సాహిత్య అకాడమీ అవార్డును అందుకొన్నారు. 1975లో “హజార్ చౌరాసియా కి మా” (వెయ్యీ ఎనభై నాలుగో నెంబరు వాడి తల్లి) అనే నవలను, మాక్సిమ్ గోర్కీ ‘అమ్మ’ నవల స్ఫూర్తితో, నక్సలైట్ ఉద్యమ నేపథ్యంలో ఆవిడ రచించారు. 1956లోనే ఆవిడ ‘ఝాన్సీరాణీ’ అన్న చారిత్రక గ్రంథాన్ని వ్రాశారు. ఆవిడ ఎన్నో నవలలను, చిన్న కథలను– మహిళల, వెలివేయబడ్డ జనాల, రైతుల, తిరుగుబాటుదార్ల సమస్యల అంశాలతో వ్రాశారు. బహుళ రూపాలలో అణగద్రొక్కబడిన, వెనుకబడిన, అణగారిన జనం గురించి వారి సమస్యల గురించి ఆవిడ తన సాహిత్య రచనా వ్యాసంగం ద్వారా, ఆ అట్టడుగు జనానికి ప్రాతినిధ్యం వహించారు. దోపిడీ, అణవేతలకు వ్యతిరేకంగా చైతన్యస్ఫూర్తిని నిరంతరాయంగా రగిలించిన మహనీయురాలు మహాశ్వేతాదేవి.

ఆవిడ సింగూర్, నందిగ్రామ్‌లలో పచ్చని పంటలు పండే రైతాంగ భూములను పరిశ్రమల కోసం బలవంతంగా వామపక్ష ప్రభుత్వం స్వాధీనపరుచుకోవటాన్ని వ్యతిరేకిస్తూ, ప్రభుత్వపు పారిశ్రామిక విధానాన్ని నిర్మొహమాటంగా, సూటిగా ప్రశ్నించిన ధీశాలి.

అదే విధంగా, ‘ప్రభుత్వ వ్యతిరేక ఊరేగింపు’ నొక దానిని నిషేధించటాన్నీ, ప్రభుత్వ వ్యతిరేక వార్తాపత్రికలను లైబ్రరీల నుండి తొలగించటాన్నీ నీళ్ళునమలకుండా నిరసించి, మమతాబెనర్జీ ప్రభుత్వాన్ని ‘ఫాసిస్టు’ ప్రభుత్వంగా పేర్కొన్న నిష్పాక్షిక ప్రజాపక్ష పోరాట యోధురాలు మహాశ్వేతాదేవి.

భారత సాహితీ ఉద్యమ చరిత్రలో అట్టడుగు ప్రజల పనుపున పోరాడిన అటువంటి  అరుదైన, యోధురాలైన 'పీడిత ప్రజా గళం' మూగవోయింది.

'జనశక్తి' ఆ మహోనీయురాలికి తన శ్రద్ధాంజలి ఘటిస్తోంది.

ప్రజలకు వారి హక్కులు నిరాకరింపబడుతున్నంత కాలం, వారిపై పీడన దోపిడీలను కొనసాగిస్తున్నంత కాలం, సామాజిక వివక్షతలు, సాధికారనిరాకరణలు కొనసాగుతున్నంత కాలం–మహాశ్వేతాదేవి యొక్క పోరాట పటిమ, నిబద్ధతలు, నిరంతరం పోరాటస్ఫూర్తిని కల్గిస్తూనే వుంటాయి.

జనం కోసం పోరాడే వారికి ఆవిడ నిరంతరం ప్రేరణను కల్గించే అమరురాలుగానే భారత సామాజిక పోరాట ప్రస్థానంలో నిలిచివుంటారు.

oooooo